క్లుప్తంగా

రాష్ట్రస్థాయి రెజ్లింగ్, కబడ్డీ పోటీలకు ఎంపిక



దుగ్గొండి : రాష్ట్రస్థాయి రెజ్లింగ్, కబడ్డీ పోటీలకు గిర్నిబావి సమీపంలోని న్యూవిజన్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఈనెల 14న వరంగల్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి రెజ్లింగ్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. రెజ్లింగ్‌లో చరణ్, వరుణ్, వెంకటేశ్, సాకేత్, నవీన్, కబడ్డీలో రాజేందర్, జగన్, రాంచరణ్, శివమణి ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను సోమవారం పాఠశాలలో కరస్పాండెంట్ నర్సింహారెడ్డి, మోతె రాజు, పీఈటీలు రాజేందర్, శ్రీధర్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థినికి సన్మానం



నల్లబెల్లి : పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మండలంలోని రంగాపూరం హైస్కూల్ విద్యార్థిని కల్వా అక్షయను దళిత విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సోమవారం శాలువాతో సన్మానించారు. అనంతరం మెమోంటో అందజేసి అభినందించారు. అనంతరం వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య మాట్లాడారు. జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేలా చదువుల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రఘువీర్, రామకృష్ణమూర్తి, శ్రీనివాస్, మహేందర్‌రెడ్డి, రామ్ మనోహర్, ఉషారాణి, వెంకటయ్య పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

నల్లబెల్లి : మండలంలోని బజ్జుతండా శివారులోని చిన్నతండా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ రోడ్డుపై గ్రామస్తులు సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం జాతీయ రహదారి నుంచి చిన్నతండా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.70 లక్షలు మంజూరు చేసిందని చెప్పారు. ఇప్పటివరకు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదని ఆందోళన వెలిబుచ్చారు. ఈ క్రమంలో కొద్దిపాటి వర్షానికే రోడ్డు బురదమయమవుతోందని వాపోయారు. ఇకనైనా వెంటనే రోడ్డు నిర్మాణ పనులు వెంటనే చేపట్టేలా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవ చూపాలని కోరారు.

కుమ్మరికుంటలో చేపలు పోయకుండా అడ్డగింత

ఖానాపురం : మండలంలోని బాల్‌తండాలోని కుమ్మరికుంటలో చేపలు పోయకుండా ముదిరాజ్ సొసైటీ ప్రతినిధులను తండావాసులు సోమవారం అడ్డుకున్నారు. చర్చనీయాంశంగా మారిన ఈ ఘటన వివరాలిలా.. మండలంలోని ధర్మరావుపేట శివారులోని బాల్‌తండా పరిధిలోని కుమ్మరికుంటను చేపలు పోసి పెంచుకునేందుకు మత్స్య శఖాఖ అధికారులు రాగంపేట ముదిరాజ్ సొసైటీకి అప్పగించారు. దీంతో ముదిరాజ్ సొసైటీ బాధ్యులు చేపలు పోయడానికి సోమవారం రాగా తండావాసులు అడ్డుకున్నారు. అనేక ఏళ్లుగా కుమ్మరికుంట తండావాసుల ఆధీనంలోనే ఉందని, గతేడాది కుంటలో తామే చేపలు పోసుకుని పట్టుకున్నామని తెలిపారు. దీంతో ముదిరాజ్ సొసైటీ బాధ్యులు చేపలు పోయకుండానే వెనుదిరిగారు.

నివాళి

నర్సంపేట : పట్టణంలోని 18వ వార్డుకు చెందిన కోట పురుషోత్తం తండ్రి వీరస్వామి సోమవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి బీజేపీ జిల్లా నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు, యువమోర్చా నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొంకీస విష్ణేశ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రాజు, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తిలో..

రాయపర్తి : మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ మల్సూర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతడి మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహమూద్, గౌస్ ఖాన్, హుస్సేన్, రఫీ, గారె భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

18న బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశం

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని ధర్మారంలోని బీజేపీ కార్యాలయంలో ఈనెల 18న పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గట్టికొప్పుల రాంబాబు, కార్యాలయ కార్యదర్శి క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలలను అంగన్‌వాడీల్లో చేర్పించాలి

రాయపర్తి : బాలలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి బడికి అలవాటు చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ డెబోరా కోరారు. 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని హైస్కూల్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడారు. బాలలు బడికి అలవాటు పడే వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సత్యవతి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేటలో..

నర్సంపేట : స్థానిక ప్రాజెక్టు పరిధిలోని నర్సంపేట-4 అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ, మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభ మాట్లాడారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు నల్ల భారతి, గౌసియా, ఆయా సునీత, మౌనిక, అనిత, పద్మ పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని లోహిత, షాపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాదేవి మాట్లాడారు. మూడు నుంచి ఆరేళ్ల వరకు వయస్సున్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటల విద్య ద్వారా శారీరక, మానసిక వికాసానికి బాటలు పడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ క్రాంతి, అంగన్‌వాడీ టీచర్లు సులోచన, విజయలక్ష్మి, వినోద, శోభారాణి, ఆశ కార్యకర్త సుమలత, హెచ్‌ఎం లక్ష్మారెడ్డి, రజనీ తదితరులు పాల్గొన్నారు.



సంగెం : లోహితలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు



రాయపర్తిలో..



నర్సంపేటలో..

ఫ్లెక్సీల ఏర్పాటు..



ఫ్లెక్సీ వద్ద పంచాయతీ సిబ్బంది

పర్వతగిరి : అంగడి వద్ద రోడ్డుపై దుకాణాలు పెట్టకుండా గ్రామ పంచాయతీ సిబ్బంది సోమవారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. సంతలో వసతులపై జూన్ 15న 'పర్వతగిరి సంత.. జనానికి చింత' శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అంగడి వద్ద రోడ్డుపై దుకాణాలు ఏర్పాటు చేయకుండా వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు.

వ్యాపారులకు నోటీసులు

సాక్షి స్పందన



నోటీస్ ఇస్తున్న రఘు

పర్వతగిరి : రోడ్ల పక్కనే చెత్తాచెదారం వేస్తున్న బిర్యానీ సెంటర్లు, హోటళ్ల నిర్వాహకులకు గ్రామ పంచాయతీ అధికారులు సోమవారం నోటీసులు అందజేశారు. 'రోడ్ల పక్కనే చెత్తాచెదారం' శీర్షికతో ఈనెల 14న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రఘు సిబ్బందితో కలిసి పలు బిర్యానీ సెంటర్లు, హోటళ్ల నిర్వాహకులకు నోటీసులు ఇచ్చారు.

విలువలతో కూడిన విద్య అందించాలి



నృత్యాలను ప్రారంభిస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

రాయపర్తి (వర్ధన్నపేట) : విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆకాంక్షించారు. వర్ధన్నపేటలోని పుస్కోస్ పాఠశాలలో ఇన్వెస్ట్ టీచర్ సెర్మనీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించగా ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకునేలా ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. సైబర్ నేరాలు, మొబైల్ వినియోగం, డయల్ 100, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తొలుత విద్యార్థుల నృత్యాలను ఎస్సై ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మేరీ అంటోని, ప్రధానోపాధ్యాయురాలు డైసీ, అడ్మినిస్ట్రేటర్ జెన్నీఫర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'ఎర్రబెల్లిపై దుష్ప్రచారం..చర్యలు తీసుకోండి'

రాయపర్తి : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై దుష్ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. అనంతరం మధు మాట్లాడారు. రెండ్రోజులుగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు భారతదేశ పౌరసత్వం రద్దయ్యిందని, అమెరికాకు వెళ్లనున్నాడని, రాజకీయాలకు స్వస్తి పలుకుతున్నాడని, తదితర అసత్య ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు అశ్రఫ్ పాషా, నాయకులు మండల శ్రీధర్, సింహాద్రి, చందు సతీశ్, చిలువేరు సాయి, నవీన్, ఐత రవి, మన్సూర్, ఖలీల్, పీరని రవీందర్, నరేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధు

చినుకు పడితే చిత్తడే..



చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట గ్రామంలోని బీసీ కాలనీ చినుకు పడితే చిత్తడే అన్న చందంగా తయారైంది. పాపయ్యపేట నుంచి ఎల్లాయగూడెం గ్రామానికి తారు రోడ్డు మంజూరు కాగా కాంట్రాక్టర్ గ్రామ శివారు వరకే రోడ్డు పనులు చేపట్టి వదిలేశారు. గ్రామ శివారు నుంచి పాపయ్యపేట వరకు రోడ్డు పనులు మధ్యలో నిలిపేయడంతో సోమవారం కురిసిన వర్షానికి బురదమయం అయ్యింది. ప్రజలు నడవలేని దుస్థితి నెలకొంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డు పనులు జరిగేలా చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

హక్కులు కల్పిస్తూ చట్టం చేయాలి



రాయపర్తి (వర్ధన్నపేట) : ముదిరాజ్ కులస్తులకు చెరువులు, కుంటలపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ చట్టం చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్ధన్నపేటలోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై మహాసభ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులు అభివృద్ధి చెందేలా కార్యాచరణ చేపట్టాలని కోరారు.

ఆర్థికసాయం



నెక్కొండ : మండలంలోని గుండ్రపల్లికి చెందిన బొంత శ్రీనివాస్ గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి పదో తరగతి నాటి స్నేహితులు సోమవారం రూ.30 వేల సాయం అందజేశారు. తొలుత శ్రీనివాస చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రూ.30 వేలను కూతురు ఆశ్లేష పేరిట పోస్టాఫీస్‌లో చేసిన డిపాజిట్ బాండ్‌ను అందించారు.

క్రీస్తునగర్‌లో..

చెన్నారావుపేట : మండలంలోని క్రీస్తునగర్‌కు చెందిన ఎర్ర మార్త ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆమె కుమారుడు ఎర్ర నవీన్‌కుమార్, కూతురు అనిత స్నేహితులు సోమవారం రూ.5 వేల నగదు సాయం చేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు. కార్యక్రమంలో బండి అశోక్, కూస రాజ్‌కుమార్, ముస్కు నర్సయ్య, మేడిద లక్ష్మణ్, ముస్కు రాజు, జర్పుల యాకన్న, పెంతల నరేందర్, రూపిక హేమన్‌కుమార్, దాసరి రాజు, ధారావత్ ఈర్య, రాజ్‌మహ్మద్ పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లికి చెందిన మహ్మద్ యాకూబ్ ఇటీవల మృతి చెందగా అతడి కుమారుడు జహంగీర్‌ను ఆదర్శ రైతు సంఘం ప్రతినిధులు సోమవారం పరామర్శించారు. అనంతరం రూ.5 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సిరికొండ వెంకన్న, సభ్యులు నాసర్, డాక్టర్ ముద్రబోయిన శ్రీనివాస్, వెంకటమల్లయ్య, సోమయ్య, సురేశ్, రియాజ్, జలీల్, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యం



సదస్సులో మాట్లాడుతున్న సీఐ నరేందర్‌రెడ్డి

నెక్కొండ : మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా సమాజంలోని ప్రతీఒక్కరు కృషి చేయాలని నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. మాదకద్రవ్యాలతో తలెత్తే నష్టాలపై మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన అవగాహనా సదస్సుకు నరేందర్‌రెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్, గంజాయి, తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ అలవడిన వారికి వైద్య ఆరోగ్య శాఖ కౌన్సెలింగ్ చేస్తుందని చెప్పారు. అలాగే 18 ఏళ్లలోపు బాలలు మత్తు పదార్థాలకు అలవడితే మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపాల్ కరుణశ్రీ, ఎస్సై మహేందర్, అధ్యాపకులు రమణాకర్, ప్రభాకర్, సంపత్, ఆనందం, రంజిత్‌కుమార్, కీర్తి, భీమేందర్, శ్రీలత, భిక్షపతి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ కిషన్

రాయపర్తి : ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓ గుగులోతు కిషన్‌నాయక్ కోరారు. మండలంలోని పెర్కవేడులో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డెంగీ, ఇతర విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. వైద్యశిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు అనూష, సూపర్‌వైజర్ భీమానాయక్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ , కారోబార్ ఉపేందర్, ఏఎన్‌ఎం రజిత, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలు.. రోడ్లపైనే వరద నీరు

● వ్యాధుల నివారణ చర్యలు శూన్యం

పర్వతగిరి : భారీ వర్షాలకు మండల కేంద్రంలో రోడ్లపైనే నీరు నిలుస్తోంది. డ్రైనేజీల్లోని మురుగు రోడ్లకు మీదకు చేరి వర్షపు నీటిలో కలుస్తూ జనాన్ని బెంబేలెత్తిస్తోంది. దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్న దుస్థితి నెలకొంది. సీజనల్ వ్యాధులు పొంచి ఉండడంతో గ్రామ పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖలు నివారణ చర్యలు ఇంకా చేపట్టడం లేదంటూ మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది వర్షాకాలం గత నెలలోనే మొదలైనా కొద్ది రోజులుగా మండలంలో వర్షతీవ్రత కొనసాగుతోంది. మండలంలోని పర్వతగిరి, అన్నారం షరీఫ్ తదితర గ్రామాల్లో పలు చోట్ల రోడ్లు పల్లంగా లేని పరిస్థితుల్లో వర్షపు నీరు నిలుస్తూ దోమలు, ఈగల వృద్ధికి దారి తీస్తోన్న పరిస్థితి నెలకొంది. గతేడాది పర్వతగిరి, అన్నారం షరీఫ్, ఏనుగల్‌లో డెంగీ ప్రబలి ప్రజలు రోగాల బారిన పడి ప్రైవేట్ ఆస్పత్రుల్లో చేరి ఆర్థికంగా చితికిపోయారు. పర్వతగిరి, ఏనుగల్ గ్రామాల్లో కొందరు ప్రాణాలు కోల్పోయారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామ పంచాయతీ అధికారులు, వైద్య సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పర్వతగిరి పోలుకమ్మ చెరువు వద్ద చెత్తాచెదారం



హైస్కూల్ వద్ద నిలిచిన నీరు

వర్షపు నీటి నిల్వలతో రోగాలు

మండలంలోని పలు గ్రామాల్లో డంపింగ్ యార్డులు లేవు. చికెన్ సెంటర్లు, బిర్యానీ పాయింట్లు, తదితర వ్యాపారులే కాకుండా ప్రజలు సైతం రోడ్ల మీదే చెత్త వేస్తున్నారు. దీంతో కుక్కలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. వర్షపు నీటిలో, ఇంట్లోని నల్లాల వద్ద దోమల వ్యాప్తి చెందుతున్నాయి. పలువురు రోగాల బారిన పడుతున్నట్లు తెలుస్తోంది. వైద్య ఆరోగ్య శాఖ అధికారుల సత్వరమే స్పందించి ప్రజలు రోగాల బారిన పడకుండా అవగాహన కల్పించాల్సి ఉంది. కాగా ఇప్పటివరకు వైద్య ఆరోగ్యశాఖ, గ్రామపంచాయతీ అధికారులు చేపట్టిన చర్యలు శూన్యం కావడం గమనార్హం.

నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలి



వర్షాలకు సైడ్ కాల్వల్లో మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. ఎప్పటికప్పుడు సైడ్ కాల్వలను శుభ్రం చేయించే దిశగా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలి. రోడ్లపై చేరుతున్న మురుగు, వర్షపు నీటిని తొలగించి క్లోరినేషన్ చేయాలి. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంతోపాటు వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి. వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి.

-బొట్ల ప్రభాకర్, స్థానికుడు, పర్వతగిరి

క్లోరినేషన్ చేయిస్తాం



వర్షాలు కురుస్తున్న క్రమంలో డెంగీ, ఇతర విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. ఈగలు, దోమలు వృద్ధి చెందుతాయి. ప్రస్తుత తేమ వాతావరణంలో క్లోరినేషన్ చేసేందుకు ఇబ్బంది. వాతావరణం పొడిగా మారగానే దోమల మందు, బ్లీచింగ్ పౌడర్ క్లోరినేషన్ చేయిస్తాం. గ్రామాలు శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపడతాం. ప్రజలు చెత్తాచెదారాన్ని రోడ్ల మీద వేయకుండా అవగాహన కల్పిస్తాం. ఎప్పటికప్పుడు రోడ్లను శుభ్రం చేయిస్తాం.

-ఎంపీడీఓ శంకర్‌నాయక్

ముందస్తు అరెస్ట్

నర్సంపేట రూరల్ : చలో అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో నర్సంపేటలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్‌ను పోలీసులు సోమవారం తెల్లవారుజామున ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు.

దుగ్గొండి : మండలానికి చెందిన వివిధ పార్టీల నాయకులు గుర్రం అజయ్, తోటకూరి రాజు, బొట్ల నరేష్, రాస కిరణ్, నాగనబోయిన తిరుపతియాదవ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం వ్యక్తిగత పూచికత్తుపై వదలేశారు.

ఇద్దరిపై కేసు

రాయపర్తి (వర్ధన్నపేట) : నాటుసారా తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వర్ధన్నపేట ఎక్సైజ్ సీఐ స్వరూప తెలిపారు. సోమవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. మండలంలోని గుబ్బడిబోడుకిందితండా నుంచి రాయపర్తికి 10 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా గుగులోతు భద్రుసింగ్, గుగులోతు సరితలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వనమహోత్సవం

రాయపర్తి : వర్ధన్నపేట మండలంలోని ఉప్పరపల్లి, నల్లబెల్లి గ్రామాల్లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి ఆ శాఖ సీఐ స్వరూప ఈత, తాటి మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై గంగాధర్, సిబ్బంది వెంకటేశ్, రమేశ్, బాబు, మానస పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యం



బీజేపీలో చేరిన వారికి కండువా కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : బీజేపీ కార్యకర్తల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని ఆ పార్టీ జిల్లా నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. నల్లబెల్లి మండలంలోని రుద్రగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గుగులోతు రాంధన్, గుగులోతు రాహుల్, అజ్మీర బాలు, బయ్య బాలమల్లు, ఈర్ల హరీశ్ బీజేపీలో మండల ప్రధాన కార్యదర్శి తడుక వినయ్ ఆధ్వర్యంలో గురువారం చేరగా వారికి రాణాప్రతాప్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. పార్టీలో చేరిన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ కోకన్వీనర్ కట్ల రామచంద్రారెడ్డి, నర్సంపేట మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి రాము, బీజేవైఎం నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొంకిస విష్ణేశ్, రుద్రగూడెం గ్రామ బూత్ కమిటీల అధ్యక్షులు ఈర్ల నాగరాజు, ఈర్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధి బిల్లులు చెల్లించాలి

రాయపర్తి (వర్ధన్నపేట) : 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని ఆర్‌ఎస్‌పీ జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్ధన్నపేటలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కూల్ పేరెంట్స్ కమిటీ తీర్మానంతో పాఠశాలల్లో ప్రహరీ, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తదితర పనులు చేసి ఏళ్లు గడుస్తున్నా చెల్లించకపోవడం సరికాదన్నారు. అప్పు చేసి పనులు నిర్వహించిన క్రమంలో బిల్లులు అందక రోడ్డున పడే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో నాయకులు దుబ్బర సురేందర్, బానోతు పుణ్యానాయక్ పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవేను రద్దు చేయాలి

పర్వతగిరి : నాగ్‌పూర్ నుంచి అమరావతి వరకు చేపట్టిన గ్రీన్ ఫీల్డ్ హైవేను రద్దు చేయాలని మండలంలోని ఏనుగల్ రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌కు రైతులు సోమవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గ్రీన్ ఫీల్డ్ హైవేను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. సన్న, చిన్నకారు రైతులుగా భూమి మీద ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నట్లు తెలిపారు. ఏటా 2, 3 పంటలు పండుతాయని చెప్పారు. గ్రీన్ ఫీల్డ్ హైవే కాకుండా బ్రౌన్ ఫీల్డ్ హైవేగా మార్చాలని లేదా గ్రీన్ ఫీల్డ్ హైవేను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత రైతులకు ఎకరానికి రూ.10 కోట్ల పరిహారం చెల్లించాలని, టోల్ ప్లాజా రుసుంలో 70 శాతం రైతులకు చెల్లించాలని చెప్పారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతులు కె.కుమారస్వామి, బి.దేవేందర్, కె.వెంకన్న, కె.శ్రీనివాస్, సాంబయ్య, కె.రాములు, ఎన్.భిక్షపతి, ఎం.మదార్, తదితరులు పాల్గొన్నారు.